



వ్యవసాయేతర భూములను పరిశీలిస్తున్న లింగ్యానాయక్



సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శశాంక, కలెక్టర్ గౌతమ్

# అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

## అధికారులు బాధ్యతగా పని చేయాలి

- జిల్లా ప్రత్యేకాధికారి శశాంక
- సమీక్షకు హాజరైన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా స్పెషలాఫీసర్, రాష్ట్ర ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్ కమిషనర్ శశాంక ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్‌తో కలసి సంక్షేమ పథకాల సర్వే తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ సర్వే నంబర్ ప్రకారం భూములు సాగు యోగ్యమైనదా, కాదా అనేది స్పష్టంగా గుర్తించి నివేదికలను తయారు చేయాలన్నారు. ఉపాధిహామి కూలీల గుర్తింపు కార్డును, ఆధార్‌కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలన్నారు. కుల గణన ఆధారంగా తయారు చేసిన రేషన్‌కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని వారు, పూరి గుడెసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు, నిర్మాణానికి స్థలం ఉన్న వారు అర్హులని ఆయన వెల్లడించారు. జిల్లాలో 12,243 రేషన్‌కార్డుల దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ గౌతమ్ వివరించారు. అనంతరం అలియాబాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న పద్మ ఇంటికి స్పెషలాఫీసర్ శశాంక, కలెక్టర్ గౌతమ్ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజేయందర్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి సుగుణబాయి, జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఎంపీడీఓ మమతాబాయి తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం తూంకుంటలో రాజీవ్‌రహదారి విస్తరణ రోడ్డు మ్యాప్‌ను వారు పరిశీలించారు.



# 50 వేల లోపే..

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులు

- కసరత్తు దాదాపు పూర్తి చేసిన అధికారులు
- కొలిక్కి వస్తున్న వ్యవసాయ కూలీల సంఖ్య
- ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుల ఆధారంగా వివరాల సేకరణ
- గుంట భూమి ఉన్నా పథకానికి దూరం

"ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 26 నుంచి పథకం అమలు చేయడానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వడివడిగా చేపడుతోంది. ఈ పథకం ద్వారా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు రూ.12 వేల చొప్పున అందించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా కుటుంబాలకు రెండు విడతలుగా ఆరు నెలలకోసారి రూ.6 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. కాగా, ఉమ్మడి జిల్లాలో 50 వేల లోపే లబ్ధిదారులు ఉండే అవకాశం ఉందని అధికారుల లెక్కల్లో స్పష్టమవుతోంది.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : రైతాంగం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూలీలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. వారికి ప్రతి ఏటా రూ. 12వేల ఆర్థిక సహాయం అందచేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం రోజున ఈ పథకాన్ని ప్రారంభించి భూమి లేని నిరుపేద కూలీలకు ఏటా రూ. 12వేల ఆర్థిక సహాయం అందచేయనుంది. ఈ సహాయాన్ని ఏటా రెండు విడతలుగా రూ.6వేల చొప్పున నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేసింది. ప్రభుత్వం వద్ద ఇప్పటికే ఉన్న ఉపాధి కూలీల జాబితాతో పాటు ధరణి వివరాలతో సరిపోల్చి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో

మిగతా 7వ పేజీలో...

## సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు, జనవరి17(ఆంధ్రజ్యోతి): ధారూరు గ్రామంలోని వ్యవసాయేతర భూముల సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న వ్యవసాయ భూములను, వెంచర్లను, పడావు భూములను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అంతకు ముందు ఎబ్బనూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను సైతం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదా బేగం, డిప్యూటీ తహసీల్ధార్ విజయేంద్ర, ఏఈవోలు సంజూ రాథోడ్, సంతోష్‌లు ఉన్నారు.

## సకాలంలో పూర్తి చేయాలి

### భూసర్వేపై అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమీక్ష

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సాగుకు యోగ్యం కాని భూముల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ తహసీల్దారు కార్యాలయంలో ఆయన సర్వే వివరాలను పరిశీలించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. సాగుకు యోగ్యంగా లేని భూముల సర్వేను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులు 5 బృందాలుగా ఏర్పడి భూముల వివరాలు సేకరిస్తున్నారని, ఇప్పటి వరకు 9 గ్రామాల్లో సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, తహసీల్దారు డీఎస్ రజిని, డిప్యూటీ తహసీల్దారు రాజేందర్, మండల వ్యవసాయ అధికారి బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

**యువ దంపతుల ఆత్మహత్య**
వికారాబాద్ జిల్లా కేంద్రంలో దారుణం
వారిది ప్రేమ వివాహం
కేసు నమోదు.. పోలీసుల విచారణ 7

**ఆలయాలను బాగు చేసుకుందాం**
తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
ఆలయాలకు కొత్త పాలక మండళ్లు.. ప్రమాణ స్వీకారం 7

# అమ్మమ్మే అమ్మకానికి పెట్టింది

- ఏడేళ్ల చిన్నారిని విక్రయానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. కేసు నమోదు
- గతంలో బాబును అమ్మినట్లు ఆరోపణలు

మర్పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి పెంచిన అమ్మమ్మే మనవరాలును అమ్మకానికి పెట్టింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో కలకలం రేపింది. మర్పల్లి మండలం ఘణాపూర్ గ్రామానికి చెందిన యాదమ్మకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే యాదమ్మ భర్త గతంలోనే చనిపోగా కుమారుడు ఇటీవల మరణించారు. ఒక కూతురుకు వివాహం చేసి పంపించగా, మరో కూతురు సౌందర్య ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోయింది. సౌందర్యకు మొదటగా బాబు జన్మించిన తరువాత భర్త విడిచి పెట్టడంతో తల్లి చెంతకు చేరింది. ఆ తరువాత ఆమె మరో పాపకు జన్మనిచ్చింది. ఆ సమయంలో సౌందర్య మతిస్థితిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోగా యాదమ్మ పిల్లలను పెంచింది. అయితే యాదమ్మ హైదరాబాద్‌తో పాటు మర్పల్లి మండలం ఘణాపూర్ గ్రామానికి వస్తూ పోతుండేది. ఆమెవద్ద ప్రస్తుతం ఉన్న ఏడేళ్ల పాపను శుక్రవారం అమ్మకానికి పెట్టినట్లుగా గ్రామస్తులకు అనుమానం వచ్చింది. దీనికి తోడు గ్రామంలో ఉన్న ఇంటిని ఖాళీ చేసి సామాన్లు సర్దుకొని ఎవరితోనో అనుమానంగా మాట్లాడిన మాటలు ఇరుగుపొరుగు విన్నారు. దీంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు గతంలో బాబును కూడా అమ్మిన యాదమ్మ ఈ పాపను కూడా అమ్ముతుందని ఆ నోటా ఈ నోటా గ్రామంలో వ్యాపించడంతో గ్రామస్తుల పోలీసులకు సమాచారం అందించారు.



చిన్నారిని అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

### మరోసారి యత్నం

యాదమ్మ.. బాబు పుట్టిన కొద్ది రోజులకే అమ్మివేసిందని గ్రామస్తులు ఆరోపించారు. తన వద్ద ఉన్న పాపను సైతం ఆమె అమ్మేందుకు యత్నించినట్లు పోలీసులకు తెలిపారు. పోలీసులు ఐసీడీఎస్ సీడీపీవో ప్రవీణకు సమాచారం అందించడంతో సూపర్‌వైజర్ రిజ్వాన, అంగన్‌వాడీ టీచర్లు విజయ, పుష్పలు గ్రామానికి చేరుకుని పాపను రక్షించి శిశు గృహకు, యాదమ్మను స్టేషన్‌కు తరలించారు. అయితే యాదమ్మకు హైదరాబాద్ బొల్లారంతో పాటు ఘణాపూర్‌లో రెండు ఆధార్ కార్డులు ఉన్నట్లుగా తెలుస్తోంది. యాదమ్మ బాబును ఎవరికైనా అమ్మిందా? ఈ పాపను ఎవరికి అమ్మేందుకు చూసింది. ముందు ఉన్న బాబు ఏమయ్యాడు అనేది ప్రశ్నగా మారగా పోలీసులు ఆమెను విచారిస్తున్నారు.

# రోడ్డు పనుల్లో నాణ్యతను పాటించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కడా కార్యాలయంలో పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్డు నిర్మాణాల్లో సంబంధిత శాఖల ఇంజనీర్లు వెంటనే తనిఖీలు నిర్వహించి అంచనాలు రూపొందించాలని సూచించారు. పనులు చేపట్టే క్రమంలో నీటి సరఫరా పైపు లైన్, విద్యుత్ స్తంభాలు మార్చేందుకు అయ్యే ఖర్చుల కోసం నివేదికలు ఇవ్వాలన్నారు. భగీరథ తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పనులు చేపట్టాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో రోడ్డు వేసే క్రమంలో ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి, సంజీవరెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఇంజనీరింగ్ విభాగం డీఈ, ఈఈలు పాల్గొన్నారు. అనంతరం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు.



దర్గాలో భక్త జనసందోహం

# భక్తిశ్రద్ధలతో దీపారాధన

- రెండో రోజు కొనసాగిన జేపీ దర్గా ఉర్సు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కొత్తూర్, జనవరి 17:(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. దర్గా ఆవరణలో వక్ఫ్‌బోర్డు అధికారులతో పాటు, మహిళలు కొవ్వొత్తులు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ముస్లింలు దర్గాలో నమాజులు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే నియాజ్‌లు నిర్వహించి అన్నదానాలు చేశారు. కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మారావు, ఎస్‌ఐలు శ్రీనివాస్, మురళీగౌడ్ ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు. శనివారం ఖత్మే ఖురాన్‌తో దర్గా ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి.



దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కొడంగల్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొడంగల్ పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. క్రీడాకారులను ఉత్సాహ పర్చేందుకు నాయకులు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజ్, సంతోష్ కుమార్, రాము, జె.కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కృష్ణంరాజు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# వృథాగా మినీ స్టేడియం!

## 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచని మైదానం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- విచ్చలవిడిగా మద్యం బాటిళ్లు..
- ఆందోళనలో క్రీడాకారులు



మేడ్చల్ మినీ స్టేడియం

మేడ్చల్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల సౌలభ్యం కోసం మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన మినీ స్టేడియం ఏళ్లుగా వృథాగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించి 20 ఏళ్ల దాటినా అభివృద్ధి మాత్రం ఒక్క అడుగు ముందుకు దాటడం లేదు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి దేవేందర్ గౌడ్ ప్రత్యేక

మిగతా 8వ పేజీలో...

### ఇప్పటికైనా అభివృద్ధి చేయాలి

స్టేడియం ప్రాంతాన్ని ఎవరూ పట్టించుకోక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీనికి తోడు కొందరు పశువుల కాపరులు స్టేడియం గ్యాలరీ కింది భాగాన్ని, క్రీడాకారుల కోసం నిర్మించిన గదులను పశువుల కొట్టంలా వాడుకుంటున్నారు. స్టేడియం పరిసరాల్లో పశువుల పెంట కుప్పలు, ఖాళీ మందు బాటిళ్లు విచ్చలవిడిగా కనబడుతున్నా పట్టించుకునే వారు లేరు. సాయంత్రం కాగానే మందుబాబులు, గంజాయి బ్యాచ్ దమ్ము కొట్టేందుకు స్టేడియం వద్దకు చేరుకుని జల్సా చేసి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వమైనా స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని క్రీడాకారులు, స్థానికులు కోరుతున్నారు.

### గత ప్రభుత్వ హయాంలో హడావిడి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా హడావిడిగా అప్పటి మంత్రి కేటీఆర్‌తో స్టేడియాన్ని ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకున్న స్టేడియం గ్యాలరీలకు రంగులు వేసి, గ్రౌండ్‌లో వెలిసిన పిచ్చిమొక్కలను తొలగించి గుంతలను పూడ్చి మైదానాన్ని చదును చేసి ఒక రోజు పాటు క్రీడాకారులను మురిపించారు. కేటీఆర్ ప్రారంభించడంతో స్టేడియం దశ, దిశ మారుతుందని భావించిన క్రీడాకారులకు నిరాశే మిగిలింది. ఆ తర్వాత స్టేడియం వైపు అధికారులు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.

## మార్కెట్ ధరతో పరిహారం చెల్లించాలి



అగర్‌మియాగూడలో రైతులతో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

కందుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు ఎకరాకు బహిరంగ మార్కెట్ ధరతో సమానంగా పరిహారం చెల్లించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లేమూరు, అగర్‌యాగూడ, తిమ్మాపురం గ్రామాల్లో బాధిత రైతులతో మాట్లాడారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో విలువైన భూములను రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్‌సిటీకి రోడ్డు పేరుతో సేకరిస్తుందని, రైతులకు మాత్రం తూతూమంత్రంగా పరిహారం ఇవ్వడానికి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఈ ప్రాంతంలో బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.5 కోట్లు పలుకుతుందని, ప్రభుత్వం రూ.25 లక్షల నుంచి రూ.90లక్షల వరకు పరిహారం ఇవ్వడానికి ప్రణాళికలు వేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం బలవంతంగా చేపట్టనున్న భూసేకరణను అడ్డుకుంటామని, మార్కెట్ ధరతో పరిహారం చెల్లించాలని తమ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లేమూరు మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసుదన్ రెడ్డి, అంజయ్య, కందుకూరు, మహేశ్వరం, ఆమనగల్లు మండలాల పార్టీ కార్యదర్శులు బుట్టి బాల్‌రాజ్, ఏ.శేఖర్, శివశంకర్, జిల్లా వ్యవసాయ సంఘం నాయకులు కుమార్, శ్రీనివాస్, చందు, కవిత పాల్గొన్నారు.

## 'ఐడీపీఎల్'పై ఎంపీ ఈటలతో చర్చ



ఈటల రాజేందర్‌తో కమిటీ సభ్యులు

మేడ్చల్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మూతబడ్డ ఐడీపీఎల్ పరిశ్రమను పరిశీలించడానికి వచ్చిన కెమికల్స్ ఫర్టిలైజర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు శనివారం మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు శివారులోని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు కీర్తి ఆజాద్‌ను సన్మానించారు. అనంతరం ఐడీబీఎల్ పరిశ్రమ మూత పడటానికి గల కారణాల గురించి చర్చించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కమిటీ సభ్యులుగా ఉన్న ఎంపీలు, మేడ్చల్-మల్కాజ్గిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి నాయకులు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, శేఖర్, ఏనుగు సుదర్శన్ రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న ఏడీఈ అశోక్

శామీర్‌పేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ ఎంప్లాయ్ యూనియన్ హెచ్-82 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏడీఈ అశోక్ విడుదల చేశారు. శుక్రవారం మండల కేంద్రం శామీర్‌పేట విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఏడీఈ చేతులమీదుగా ఆ యూనియన్ సర్కిల్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించి ఏఈ రాఘవేందర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ సబ్ ఇంజినీర్ శ్రీధర్, హెచ్-82 యూనియన్ కార్మికులు ప్రకాశ్, శోభన్, చంద్రశేఖర్, శ్రీకాంత్, బాబురావు, ప్రవీణ్, అనిల్, నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సాగుకు పనికిరాని భూములను గుర్తిస్తున్నాం



వ్యవసాయేతర భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల, జనవరి 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సాగుకు పనికిరాని భూములను పరిశీలిస్తున్నామని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం యాలాల మండల పరిధిలోని కోకట్ గ్రామ శివారులో వ్యవసాయేత భూములను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి గ్రామంలో సాగుకు పనికిరాని భూములను గుర్తిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డుల సర్వే కూడా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ శరణ్, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గట్టుమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఏసీపీ



గట్టుమైసమ్మను దర్శించుకుంటున్న మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి

ఘట్‌కేసర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ గట్టు మైసమ్మ అమ్మవారిని శుక్రవారం మాల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి దర్శించుకున్నారు. ఆదివారం జరిగే జాతర సందర్భంగా ఆయన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘాను పర్యవేక్షించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని, ఈఓ భాగ్యలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ పరశురాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు



తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

శంషాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు మూడో రోజు పది కేసులు నమోదు చేశారు. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎంవీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీఐ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు బదులు కమర్షియల్ యాక్టివిటీ, ఇద్దరు డ్రైవర్లు ఉన్న చోట ఒక్కడే డ్రైవర్, పర్మిట్లు సరిగా లేకపోవడం, తెలంగాణ ట్యాక్స్ చెల్లించకపోవడం వంటి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆరెంజ్ ట్రావెల్స్, ఇంటర్ సిటీ, వైఎస్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసిన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఎంవీఐ నవీన్‌కుమార్, సాయికృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐని ఇన్ముల్‌నర్వకు తరలించేందుకు కృషి

### వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా



మాట్లాడుతున్న సయ్యద్ అజ్మతుల్లా, పక్కన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న జేపీ ఐటీఐని ఇన్ముల్‌నర్వ ప్రాంతానికి తరలించేందుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కృషి చేస్తానని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా తెలిపారు. ఈనెల 3న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'సాంకేతిక విద్యకు దూరం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వక్ఫ్ బోర్డు చైర్మన్ స్పందించారు. దర్గా ఉర్సులో పాల్గొనడానికి వచ్చిన అజ్మతుల్లా ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గం రంగారెడ్డి జిల్లాలోకి మారిందన్నారు. ప్రస్తుతం జేపీ దర్గా పేరిట ఉన్న జేపీ ఐటీఐ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కొనసాగుతుందని, దీంతో ఈ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక వద్య అందడం లేదన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి జేపీ ఐటీఐ ఇన్ముల్‌నర్వ ప్రాంతానికి తీసుకవచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఎకరానికి రూ.2 కోట్లు ఇవ్వాలి

### బేగరికంచ రైతుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

కందుకూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మీర్కాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములు కోల్పోయే రైతుకు ఎకరానికి రూ.2 కోట్ల పరిహారంతోపాటు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం, ఉద్యోగం ఇవ్వాలని బేగరికంచ రైతులు అధికారులకు విన్నవించారు. శుక్రవారం తహసీల్దార్ కె.గోపాల్ బేగరికంచలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలోని బేగరికంచ గ్రామానికి చెందిన 43 మంది రైతులు 35 ఎకరాల ఆలయ భూముల్లో కబ్జాలో ఉన్నారని, వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం ఇచ్చి భూములు తీసుకోన్నుట్లు తెలిపారు. రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎకరానికి రూ.7 లక్షలు, మరికొందరికి రూ.12 లక్షల పరిహారం ఇచ్చిందని, ఈసారైనా తమ వద్ద భూములు తీసుకుంటున్న ప్రభుత్వం ఎకరాకు రూ.2 కోట్లు, భూములు కల్పోయే రైతులకు 121 గజాల ఇంటి స్థలం, ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. రైతులు కోరిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ తారక్, ఎంఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

## ముమ్మరంగా భూ వివరాల సేకరణ

- సాగుకు యోగ్యం కాని భూములపై సర్వే
- గ్రామ సభల్లో జాబితా ప్రదర్శన
- ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి



ఆమనగల్లులో రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జగదీశ్వర్ రెడ్డి

ఆమనగల్లు /కడ్తాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా అమలులో భాగంగా ప్రభుత్వ ఆదేశానుసారం సాగు కు యోగ్యం కాని భూముల వివరాల సేకరణ కార్యక్రమం డివిజన్ పరిధిలో ముమ్మరంగా సాగుతుందని కందుకూరు ఆర్డీవో నెల్లూరు జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్, మండలాల్లో సర్వే కోసం 12 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలో శుక్రవారం ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పర్యటించారు. ఆయా రైతు వేదికల్లో అధికారులతో సమావేశమయ్యారు. రెవెన్యూ మ్యాప్‌లను పరిశీలించారు. సాగులో లేని భూములను పరిశీలించి రైతు భరోసా నుంచి తొలిగించాలని తహసీల్దార్లు లలిత, ముంతాజ్, ఏవోలు శ్రీనివాస్ గౌడ్, శ్రీలతకు ఆదేశించారు. సోమవారం నుంచి నిర్వహించే గ్రామసభల్లో సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు ప్రదర్శించి అభ్యంతాలు ఉంటే స్వీకరించాలని సూచించారు. సేద్యానికి అనుకూలంగా ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా అందుతుందని తెలిపారు.

## లక్షలు వెచ్చించారు..

# వినియోగం మరిచారు



ఆమనగల్లులో శిథిలావస్థకు చేరుకున్న ఇరిగేషన్ శాఖ భవనం

- ఆమనగల్లులో నిరుపయోగంగా ఇరిగేషన్ భవనం
- స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న స్థానికులు

ఆమనగల్లు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిరక్ష్యంతో అనేక ప్రభుత్వ భవనాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. సర్కార్ ఆస్తుల పరిరక్షణ, వినియోగంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తుంది. ఇందుకు ఆమనగల్లు పట్టణంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవనం నిదర్శనంగా నిలిచింది. మూడు దశాబ్దాల క్రితం హైదరాబాద్ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఇరిగేషన్ శాఖకు కార్యాలయ భనవం నిర్మించారు. కొంతకాలంపాటు చిన్న నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది అందులో కార్యకలాపాలు సాగించారు. భవనాన్ని అనుసరించి శ్మశానవాటిక ఉండడంతో దాన్ని ఖాళీ చేశారు. భవనం నిరుపయోగంగా ఉండడంతో తలుపులు, కిటికీలు, బండలు, ఇతర వస్తువులు అపహరణకు గురయ్యాయి.

### దశాబ్దం క్రితం మరమ్మతులు

ఇరిగేషన్ భవనాన్ని వినియోగంలోకి తేవాలన్న స్థానికుల విన్నపం మేరకు దశాబ్దం క్రితం రూ.2 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేశారు. కానీ, వినియోగం లేకదీంతో మూగజీవాలకు ఆవాసంగా మారింది. ముళ్ల పొదలు, చెత్తతో నిండిపోయింది. నిర్లక్ష్యం చేస్తే కోట్ల రూపాయాల విలువ చేసే స్థలం అన్యాక్రాం తమయ్యే ప్రమాదం ఉంది. ఇరిగేషన్ శాఖకు ఆమనగల్లు పూర్వపు పంచాయతీ సమితి పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో ఎక్కడా కార్యాలయం లేదు. ఆ శాఖ అధికారులు ఎక్కడ ఉంటారో, ఎప్పుడు వచ్చి వెళ్తారో తెలియని పరిస్థితి. ఆ శాఖకు సంబంధించి భవనం ఒకటి ఉందన్న విషయం రికార్డుల్లో ఉందో లేదో తెలియదు. భవ నానికి మరమ్మతులు చేసి వినియోగంలో కి తెస్తే డివిజన్ స్థాయి కార్యాలయానికి ఉపకరిస్తుంది. నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. చాలా కాలంగా ఇరిగేషన్ ఏఈ, డీఈఈ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజాప్రతినిధులు, నాయ కులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినా స్పందన లేదు. ఆదిశగా ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు, ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### మరమ్మతులు చేయాలి



ఆమనగల్లు పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ఇరిగేషన్ శాఖ భవనాన్ని మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలి. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి. భవనం అలాగే వదిలేస్తే స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉంది. ఆమనగల్లులో ఇరిగేషన్ శాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తే నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

*- బైకని యాదమ్మశ్రీశైలం యాదవ్, కౌన్సిలర్, ఆమనగల్లు*

### అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆమనగల్లు ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. భవనాన్ని ఆధునీకరించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

*- యాట గీతానర్సింహ, ఏఎంసీ చైర్మన్, ఆమనగల్లు*

# 50వేల లోపే..

(5వ పేజీ తరువాయి)

ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 రోజులకు పైబడి పనిచేసిన వారిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా ప్రాథమికంగా గుర్తిస్తున్నారు. కూలీల జాబ్‌కార్డుల ఆధారంగా వివరాలను సేకరిస్తున్నారు. ఈ జాబితాను ధరణి పోర్టల్‌తో అనుసంధానం చేసి ఇందులో భూమి ఉన్నవారిని గుర్తించి జాబితా నుంచి వీరిని తొలగిస్తున్నారు. ఇలా రెండు విడతలుగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తున్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఈ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి ఈ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించనున్నారు.

### గుంట భూమి ఉన్నా అనర్హులే..

ఉమ్మడి జిల్లాలో గుంటల్లో భూమి ఉన్నవారు అనేక మంది ఉన్నారు. వీరికి గత ప్రభుత్వం గుంట లెక్కన రైతు బంధు ఇచ్చేది. గుంట విస్తీర్ణం ఉన్న వారికి కూడా రైతు బంధు కింద గతంలో రూ. 250ల చొప్పున ఇచేవారు. గుంటల్లో భూమి ఉన్న వారు అనేక మంది ఉన్నారు. వీరంతా కూడా దాదాపు కూలీలుగా చేస్తుంటారు. అయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఇలాంటి వారికి లబ్ధిచేకూరే అవకాశాలు లేవు. గుంట భూమి ఉన్నా కూడా ప్రభుత్వం వీరిని కూలీలుగా గుర్తించడం లేదని తెలిసింది. ప్రస్తుతం అధికారులు చేస్తున్న కసరత్తు ప్రకారం అసలు భూమి లేని వారిని మాత్రమే కూలీలుగా గుర్తిస్తున్నారు. 10 గుంటలలోపు ఉన్న వారికైనా ఈ పథకం కింద లబ్ధిచేకూర్చాలని కొందరు కోరుతున్నారు. అయితే ఈ విషయంపై ప్రభుత్వం కూడా క్షేత్రస్థాయి నుంచి కొంత సమాచారం సేకరించి సానుకూల నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అలాగే కొందరికి ప్రభుత్వం గతంలో భూములు అసైన్ చేసింది. కానీ ఈ భూములు సాగుకు యోగ్యమైనవి కాకపోవడంతో ఇలాంటి వారంతా నిత్యదినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. అలాగే మరి కొందరు ఉపాధి పనులకు వెళ్లకుండా వ్యవసాయేతర కూలీలుగా ఇతర రంగాల్లో పనిచేస్తున్నారు. అలాంటి వారి పేర్లు ఉపాధి డేటాలో కనిపించే ఆస్కారం లేదు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందనేది తెలియడం లేదు.

### రంగారెడ్డి జిల్లాలో 14,248 మంది

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తిచేశారు. రంగారెడ్డిజిల్లాలో దాదాపు లక్ష మంది ఉపాధి హామీ కూలీలు జాబ్‌కార్డులను కలిగి ఉండగా, ఇందులో గత ఆర్థిక సంవత్సరంలో 20 రోజులకు మించి పనిచేసిన వారు దాదాపు 80వేల మందికిపైగా ఉన్నారు. ఈ జాబితాను ధరణి పోర్టల్‌తో అనుసంధానం చేసి ఇందులో భూమి ఉన్నవారిని జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం రంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 14,248 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అలాగే వికారాబాద్ జిల్లాల్లో కూడా ఇప్పటి వరకు దాదాపు 22వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇక మేడ్చల్ జిల్లాలో సుమారు వెయ్యి మందిని ఈ పథకానికి లబ్ధిదారులుగా ఇప్పటి వరకు గుర్తించారు. తుది జాబితాను సిద్ధం చేసేందుకు ఈనెల 20 వరకు ప్రభుత్వం గడువు విధించింది.

## వికారాబాద్‌లో యువ దంపతుల ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి, అఖిలరెడ్డి (ఫైల్)

వికారాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణం కొత్తగడికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి(29), మామ కూతురు అఖిలరెడ్డి(24)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఆరుష్‌రెడ్డి ఉన్నారు. నెల రోజులుగా దంపతులు వికారాబాద్‌లోని వెంకటేశ్వర కాలనీలో అద్దెకుంటున్నారు. శ్రీకాంత్‌రెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తుండగా, అఖిల రెడ్డి గృహిణిగా ఉంటుంది. శుక్రవారం సాయంత్రం వీరి కుమారుడికి ఆరోగ్యం బాగాలేక పోవడంతో శ్రీకాంత్‌రెడ్డి తండ్రి గోవర్ధన్‌రెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా శ్రీకాంత్‌రెడ్డి, అఖిలరెడ్డిలు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డి తండ్రి ఇంటికి వచ్చిచూసే సరికి మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాలను వికారాబాద్ ఆస్పత్రిలోని మార్చురికి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## విజేతలకు బహుమతులు అందజేత



చౌదరిగూడ : క్రీడాకారులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

చౌదరిగూడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలోని పెరుమాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కేపీఎల్ సీజన్ -5 క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బహుమతులు అందజేశారు. కేకేఆర్, ముంబాయి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముంబాయి జట్టు గెలుపొందింది. విన్నర్ టీంకు దాత బోయశంకర్ రూ.30 వేలు, రన్నర్‌కు తంగెళ్లపల్లి మాజీ సర్పంచ్ ఎదిర రామకృష్ణ రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, కొందుర్గు వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

తలకొండపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెంకటాపూర్, చెన్నంపల్లి, మాదాయిపల్లి గ్రామాల్లో వారం పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. చెన్నంపల్లి, వెంకటాపూర్ క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి మాదాయిపల్లి టీంకు రూ. 5వేల నగదును అందజేశారు.

## సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

- ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా చీమల దండులా తరలిరావాలి
- 28న మహేశ్వరానికి మంద కృష్ణ మాదిగ
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ



సమావేశంలో ఎమ్మార్పీఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు

మహేశ్వరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సుకు వేల గొంతులు, లక్ష డప్పులతో చీమల దండులా కదలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల బాధ్యుడు బక్కని రవి, మండలాధ్యక్షుడు ఎర్ర గణేశ్‌మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం మహేశ్వరంలో మాదిగ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరిగితే 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి ఈ నెల 28న మహేశ్వరంలో నార్వహించే సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. దేశమంతా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతుంటే మాల సామాజిక వర్గానికి చెందిన కొందరు వర్గీకరణను వ్యతిరేకిస్తూ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే సభకు మాదిగలు ఆట పాటలు, డప్పుల దరువులతో భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు వత్తుల రఘుపతి, చంద్రయ్య, నందం, బక్కని రవి, గణేష్, నర్సింహ, మద్దిలేటి మాదిగ, ప్రశాంత్, ఆగమయ్య, జంగయ్య, స్వామి, ఉపేంద్ర, శంకరయ్య, నర్సింహ, శ్రీహరి, చందు, యాదగిరి, రాకేశ్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్న శ్రీనిధి కళాశాల

### మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీనిధి కళాశాల యాజమాన్యం ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు విషయంలో మొండిగా వ్యవహరిస్తూ రీఅసెస్మెంట్‌కు సహకరించకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నదని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో ఆరోపించారు. శ్రీనిధి కళాశాల ఆరేళ్లగా ఏడాదికి రూ.28.28 లక్షలే చెల్లిస్తున్నదని తెలిపారు. ట్యాక్స్ రీఅసెస్మెంట్ చేయడానికి సిబ్బందిని లోపలికి అనుమతించకుండా ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం కళాశాల ప్రాపర్టీ ట్యాక్స్ రూ.కోటిపైగా చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఎంచాయతీ విధించిన ట్యాక్సునే ఆన్‌లైన్‌లో చెల్లిస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నదని మండిపడ్డారు. మున్సిపల్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి, కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శ్రీనిధి కళాశాల భవనాలకు రీఅసెస్మెంట్ చేయించి మున్సిపల్ నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## ఆలయాలను బాగు చేసుకుందాం



పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆలయాన్ని బాగుచేసుకుందామని, దానికి తనవంతు సహకారం ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మంబాపూర్ మారుతి, గోపాలకృష్ణ ఆలయాలకు పాలకమండళ్లు ఏర్పడ్డాయి. మారుతి ఆలయం అధ్యక్షుడిగా వరప్రసాద్‌గౌడ్, ధర్మకర్తలుగా రాజవర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాములు, అనితను ఎన్నుకున్నారు. గోపాలకృష్ణ ఆలయ చైర్మన్‌గా ఎం.రాములు, ధర్మకర్తలుగా రేగొండి నర్సింహులు, సి.నారాయణరెడ్డి, లక్ష్మి ఎంపికయ్యారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వారిచేత ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. కొంతమంది ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మొద్దన్నారు. రైతుభరోసాలో కోతలు విధిస్తారని చెప్తున్నారని, అది నిజం కాదని చెప్పారు. కేసీఆర్ వెయ్యి ఎకరాల ఫాంహౌజ్‌కు కూడా రైతు భరోసా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సాగుకు యోగ్యం కాని భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వడం లేదని తేల్చిచెప్పారు. మరో కార్యక్రమంలో ఎమ్మెల్యే 119 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్ రవిగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దారాసింగ్, తాండూరు, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, విశ్వనాథ్‌గౌడ్, డాక్టర్ సంపత్, ఉత్తంచంద్, నరేందర్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా నాపరాళ్ల గనుల పూడ్చివేత

● అడ్డుకున్న అధికారులు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నాపరాళ్ల గనులను పూడ్చివేస్తుండటంతో బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ శుక్రవారం అడ్డుకున్నారు. మండలంలోని క్యాచెడ్‌ఘని గ్రామ శివారులోని 116 సర్వే నంబరులో గల నాపరాళ్లగని ప్రాంతంలో దాదాపు 15 ఎకరాల్లో హిటాచీ, టిప్పర్లతో గనులను పూడ్చివేస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడున్న నిర్వాహకులతో నాపరాళ్ల గనుల పూడ్చివేతకు ఎవరు అనుమతులిచ్చారు? ఎవరిది పొలం అంటూ ఆరా తీశారు. పొలానికి సంబంధించి పాస్‌పుస్తకాలు చూపించాలన్నారు. అక్కడికి వచ్చిన స్థానికులు కొందరు గత కొన్ని రోజులుగా పనులు కొనసాగుతున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తహసీల్దార్ స్పందిస్తూ అక్కడున్న వారిని పొలం ఎవరిదంటూ ప్రశ్నిస్తూ పాసుపుస్తకాలు చూపే వరకూ పనులు కొనసాగించవద్దని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

# రేషన్ కార్డులు కొందరికేనా?

- వార్డుకు పదుల సంఖ్యలోనే!
- ప్రజాపాలన దరఖాస్తుల్లో ఎంపిక చేస్తామన్న పాలకులు
- ఇప్పుడేమో మీసేవా లిస్టు అంటున్న వార్డు అధికారులు
- లిస్టులో పేర్లు లేక అయోమయంలో లబ్ధిదారులు



వికారాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జనవరి 26 నుంచి కొత్తరేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు చెబుతుండగా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ విధంగా కనిపించడం లేదు. మునిసిపల్‌లోని వార్డుల్లో, గ్రామంలో వందలాది మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తూ ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వార్డుకు 10శాతం మంది పేర్లు మాత్రమే లిస్టులో కన్పించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని, కులగణన సర్వేలో సైతం ప్రతీ ఇంటికి వచ్చి ఆ ఇంటిలో ఉన్న వారిపేర్లు కొత్తగా వివాహమైన వారిపేర్లు రాసుకుని స్టిక్లర్లను అంటించారు. ఇప్పుడు ప్రజాపాలన లెక్కల ప్రకారం కానీ, కులగణన సర్వే ప్రకారం గానీ ఎక్కడ రేషన్ కార్డు లిస్టుకు పొంతన లేక పోవడం చర్చకు దారితీసింది. అసలు ఇప్పుడు ఇస్తున్న రేషన్ కార్డు లిస్టు దేని ఆధారంగా తయారు చేశారనేది మాత్రం తెలియడంలేదు.

### మీ సేవా లిస్టు ఆధారంగా సర్వే

మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి లిస్టు ఆధారంగా తాము సర్వే చేస్తున్నట్లు వార్డు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు అర్హులా కాదా? అని గుర్తించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఇచ్చిన లిస్టు ప్రకారం సర్వే చేస్తున్నామని తెలిపారు. మిగతా వివరాలు తమకు తెలియదని చెబుతున్నారు.

### వికారాబాద్‌లో 901 మంది గుర్తింపు

వికారాబాద్ మున్సిపాలిటీలో ప్రైమరీగా రేషన్ కార్డుల కోసం 901 మందిని అధికారులు గుర్తించి వార్డు వారీగా వారి వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు అధికారులకు వచ్చిన లెక్కల ప్రకారం 1వ వార్డు 24, 2వ వార్డు 27, 3వ వార్డు 29, 4వ వార్డు 31, 5వ వార్డు 23, 6వ వార్డు 28, 7వ వార్డు 49, 8వ వార్డు 24, 9వ వార్డు 41, 10వ వార్డు 35, 11వ వార్డు 48, 12వవార్డు 30 , 13 వ వార్డు 6, 14వ వార్డు 22, 15వ వార్డు 19, 16వ వార్డు 27, 17వ వార్డు 31, 18వ వార్డు 38, 19వ వార్డు 39, 20 వార్డు 69, 21వ వార్డు 31, 22వ వార్డు 14, 23వ వార్డు 27, 24వ వార్డు 12, 25వ వార్డు 17, 26వ వార్డు 9, 27వ వార్డు 25, 28వ వార్డు 7, 29వ వార్డు 12, 30వ వార్డు 38, 31వ వార్డు 15, 32 వ వార్డు 27, 33వ వార్డు 13, 34వ వార్డు 15 మందిగా ప్రైమరీ రేషన్ కార్డులలిస్టులో పేర్లు నమోదయ్యాయి. ఈ వివరాల ప్రకారం వార్డు అధికారులు దరఖాస్తు దారులు అర్హులా? కాదా? అని గుర్తిస్తున్నారు. వీరందరికీ 26న కొత్త రేషన్‌కార్డులను అందించనున్నారు.

**పదేళ్లుగా ఎదురుచూపులు**

రాష్ట్ర ప్రభుత్వం తెలిపినట్లుగానే గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు రేషన్ కార్డులు వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు. ప్రజా పాలన దరఖాస్తుల ప్రకారం అందిస్తారా? లేక కొత్తగా దరఖాస్తు చేసుకోవాలా? అనేది అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ప్రజలకు వివరిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకటేశ్ (ఫైల్)

బొంరాస్‌పేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మైసమ్మగడ్డ తండాకు చెందిన వెంకటేశ్(22), సంతోష్ కలిసి బైక్‌పై శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్-బీజాపూర్ 163వ జాతీయ రహదారి సమీపంలోని మార్కెట్ చెక్‌పోస్టు వద్ద రంగయ్యవాడుక దగ్గర రాంగ్‌రూట్‌లో వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందగా సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంతోష్‌ను చికిత్స నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేశ్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై మృతుడి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సెలవుల నిమిత్తం తండాకు వచ్చిన వెంకటేశ్ స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

### రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్‌రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మహాత్మాగాంధీ బస్టాండ్ సమీపంలోని ఖాళీ ఖబర్ ప్రాంతానికి చెందిన వై.అనిల్ కుమార్(45) శుక్రవారం ఉదయం బైక్ తీసుకొని ఇంటినుంచి బయటకు వచ్చాడు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ అవుషాపూర్ లోని రైలుపట్టాలకు కొద్దిదూరంలో బైక్‌ను నిలిపి, సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు వెళ్తున్న ఇంటర్‌సిటీ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వేపోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అక్కడ లభించిన ఆధారాల మేరకు అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనిల్‌కుమార్ ఆత్మహత్యకు గల గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

### పశువుల పాక దగ్ధం

● రెండు దూడలు మృత్యువాత ● ఐదు గేదెలకు తీవ్రగాయాలు

పెద్దేముల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పశువులపాక దగ్ధం కాగా రెండు దూడలు మృత్యువాతపడగా ఐదు గేదెలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జనగాం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాగారం అనంత్‌రెడ్డికి గేదెలు, ఎడ్లు ఉన్నాయి. ఇంటిసమీపంలోనే పశువుల పాకలు నిర్మించి వాటిని అందులోనే కట్టేస్తారు. ఒక పశువుల పాకకు అర్ధరాత్రి నిప్పంటుకుంది. అందులో సుమారు 10గేదెలు కట్టేసి ఉన్నాయి. అర్ధరాత్రి సుమారు ఒకటిన్నర సమయంలో మెలుకువ వచ్చిన రైతుకు పశువుల పాక దగ్ధమవుతుండటంతో అప్రమత్తమై నీళ్ల పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు. కానీ అప్పటికే మొత్తం పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. అందులో కట్టేసిన గేదెలలో ఐదు గేదెలకు నిప్పంటుకుని తీవ్రగాయాలయ్యాయి. రెండు దూడలు మృత్యువాతపడ్డాయి. షార్ట్‌సర్క్యూట్ వల్లే పశువుల పాకకు మంటలు అంటుకుని ఉంటాయని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మోమిన్‌పేట్: టేకులపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, కార్యదర్శి మాధవి

మోమిన్‌పేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతాయని డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్‌ఐలు గోవర్ధన్, సరిత అన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం సర్వే నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల వివరాలను సేకరించారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు భరోసా కోసం సాగులో ఉన్న భూములను పరిశీలించారు. మేకవనంపల్లిలో 711 ఎకరాల సాగు భూమి ఉండగా అందులో 350 ఎకరాలు రియిల్ ఎస్టేట్, లేఔట్‌లకు, పరిశ్రమలకు, మైనింగ్‌లకు, రాళ్లు, రప్పలు, గుట్టలు, అనువుగా లేని భూములను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి భూపతి జయశంకర్, ఏఈవో చంద్రిక, రైతులు నాగిరెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: అర్హులందరికీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో శుక్రవారం నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బషీరాబాద్: మండల వ్యాప్తంగా 1506 రేషన్‌కార్డులకు దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కొత్త రేషన్‌కార్డులకు కుటుంబ సర్వేలో నమోదైన వ్యక్తుల ఆధార్ సంఖ్యలను సరిపోల్చుకుని అర్హులని గుర్తిస్తామని రెవెన్యూ అధికారులు శుక్రవారం వెల్లడించారు.

దోమ: బొంపల్లిలో శుక్రవారం కొత్త రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. సర్వేలో లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: కంసాన్‌పల్లిలో రేషన్‌కార్డుల సర్వే

### సాగు భూములకే రైతు భరోసా

బషీరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సాగు భూములకే రైతు భరోసా పథకం అమలు చేయనున్నట్లు బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్ అన్నారు. మండలంలోని జీవన్గి శివారు ప్రాంతంలో శుక్రవారం సాగుకు యోగ్యంగా లేని భూములను ఆయన స్వయంగా పరిశీలించారు. నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్న భూములతో పాటు వివిధ పథకాల కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను రైతు భరోసా కింద తొలగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంటు వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సర్వే అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లోకి వెళ్లి పంచాయతీ కార్యదర్శులతో కలిసి పంట పొలాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సాగు చేస్తున్న భూములపై ఆరా తీస్తున్నారు. అందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఐదు బృందాలుగా ఏర్పడి మండల పరిధిలోని సర్వే నిర్వహిస్తున్నట్లు ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములతోపాటు నాపరాతి గనులు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూముల వివరాలు సేకరించి పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మహేష్, పంచాయతీ కార్యదర్శి భవాని తదితరులున్నారు.



తాండూరు రూరల్: అల్లాపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, వ్యవసాయాధికారుల బృందం

దుద్యాల: దుద్యాల మండల కేంద్రంతో పాటు పోలెపల్లి, హకీంపేట్, కుదురుమళ్ల, హస్నాబాద్ గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ కిషన్‌నాయక్, అధికారులు రైతు భరోసా కోసం సాగులో ఉన్న భూముల సర్వే నిర్వహించారు. వ్యవసాయేతర భూములను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఏవో హిమబిందు, ఆర్‌ఐ నవీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: ప్రభుత్వం రైతు భరోసా కోసం చేపట్టిన సర్వేను అధికారులు నిర్వహిస్తున్నారు. మండలంలోని దౌల్తాబాద్, కుప్పగిరి, చంద్రకల్, చెల్లాపూర్ గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయేతర భూములు, సాగులో ఉన్న భూములను శుక్రవారం పరిశీలించారు. ఈనెల 26 నుంచి ప్రభుత్వం రైతు భరోసా అందించనుండటంతో సాగులో ఉన్న భూముల వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, ఏవో లావణ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

### రూ.1.25కోట్లతో బీటీ రోడ్డు పనులు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌడాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ గ్రామం నుంచి కామారం వరకు రూ.1.25కోట్లతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏల్పాటి అశోక్‌కుమార్ శుక్రవారం బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారులు సుదర్శన్, మణికుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, రాజేందర్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

### వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

బషీరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డి ఘణాపూర్‌లో పీవీఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు మాజీ సర్పంచ్ పి.వెంకట్‌రెడ్డి శుక్రవారం నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.శంకర్‌రెడ్డి, దస్తప్ప, పోచయ్య, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, నరహరి, ఆర్గనైజర్లు ప్రవీణ్, పవన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలపై నిలదీస్తే అవమానిస్తారా?

మేడ్చల్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సమస్యల పట్ల నిలదీస్తే తన నాయకున్ని స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి అవమానించడం సబబు కాదని బీజేపీ ఇన్‌చార్జి మేడ్చల్ నియోజకవర్గం ఎనుగు సుదర్శన్‌రెడ్డి, నియోజవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డిలు అన్నారు. మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డిని తమ పార్టీ సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి ఆస్పత్రి సమస్యల పట్ల నిలదీయగా ఆయన దురుసుగా ప్రవర్తించటంతో పాటు అవమానకరంగా మాట్లాడి ఆసుపత్రి నుంచి బయటికి పంపించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, మాజీసర్పంచ్ మురళీధర్ గుప్త పాల్గొన్నారు.

### సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు, బహిరంగ సభ పోస్టర్‌ను తాండూరు నియోజకవర్గం సీపీఎం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో సీపీఎం మహాసభలకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, నాయకులు యాదయ్య, వెంకటేష్, సతీష్, శివ పాల్గొన్నారు.

### గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



ధారూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎబ్బనూర్, మున్నూర్ సోమారం గ్రామాల్లో శుక్రవారం శ్రీ సత్య సాయి సేవా సమితి కేరెల్లి శాఖ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా 100వ జయంతి సందర్భంగా ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మున్నూర్ సోమారంలో 799 పశువులకు, ఎబ్బనూర్‌లో 415పశువులకు పశువైద్య విశ్రాంత వైద్యుడు డాక్టర్ పున్నయ్య, ధారూరు, నాగసమందర్ పశువైద్యాధికారులు శ్వేత, బాబ్జిలు, సిబ్బంది వైద్యం చేశారు. అనంతరం రైతులకు ఖనిజ మిశ్రమం, ఫీడ్ సప్లిమెంట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ సింగ్ ఠాగూర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### దుద్యాల పీఎస్‌కు ఇద్దరు నూతన ఎస్‌ఐలు

దుద్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు నూతన ఎస్‌ఐలు వచ్చారు. కులకచర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సి.సత్యశీలారెడ్డి, మర్పల్లి ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

# వృథాగా మినీ స్టేడియం!

(5వ పేజీ తరువాయి)

చొరవతో పట్టణంలోని పారిశ్రామిక వాడ సమీపంలో ఈ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏ ముహూర్తంలో పనులు ప్రారంభించారో గాని ప్రభుత్వాలు మారినా స్టేడియం పరిస్థితి మాత్రం మారడం లేదు.

### సరిపడా నిధులు అందక..

ఎన్నికల ముందు మినీ స్టేడియం పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని నేతలు హామీలు ఇచ్చినా నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఫలితంగా ఇక స్టేడియం అందని ద్రాక్షలా మారిందంటూ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఆడుకోవటానికి ఆటస్థలం లేక యువకులు ఇరుకు మైదానాల్లో ఆడుతున్నారు. ఇక బ్యాడ్మింటన్, షెటిల్ కాక్, క్రికెట్ కోసం ప్రత్యేకంగా కొందరు ప్రైవేటు వ్యక్తులు తయారు చేసిన స్టేడియాల్లో అద్దె చెల్లించి ఆడుతున్న పరిస్థితి. ఈ స్టేడియం నిర్మాణానికి 20 సంవత్సరాల క్రితం రూ. 40లక్షల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఆ తర్వాత నిధుల కొరత కారణంగా పనులకు బ్రేక్ పడింది. అనంతరం అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అసంపూర్తిగా నిలిచి పోయిన పనులను పూర్తి చేయించటానికి కొద్ది పాటు నిధులు కేటాయించి పనులు చేపట్టిందే తప్ప నిర్మాణాన్ని పూర్తి చేయని పరిస్థితి.



స్టేడియం ఆవరణలో పెంట కుప్పలు

# సీపీఎం నాయకుడిని బైండోవర్ చేయాలి

పరిగి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు ఎం.వెంకటయ్యను బైండోవర్ చేయాలని కోరుతూ సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. పీవోడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి వై.గీత మాట్లాడుతూ.. మిట్టకోడూరులోని సర్వే నంబర్లు 25,26లలో గల ప్రభుత్వ సీలింగ్ భూముల్లో సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అట్టి భూమిని సీపీఎం నాయకులు వెంకటయ్య పేదల నుంచి లాక్కోవాలని కుట్రపన్ని ఖాళీ చేయించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. అప్పట్లో ఐదుగురిపై బైండోవర్ చేశారని, సీపీఎం నాయకుడిని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వెంకటయ్యను బైండోవర్ చేయకుంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## సంక్షిప్తంగా..

**ఆర్థిక సాయం అందజేత**

మేడ్చల్ టౌన్: జనవరి 5వ తేదీన మేడ్చల్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుల బ్బాయితో సహా అతడి భార్య, కూతురు మృతి చెందగా కుమారుడు సిద్దేశ్వర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.కాగా సిద్దేశ్వర్‌కు శస్త్ర చికిత్స చేస్తున్నందున తన వంతుగా కౌన్సిలర్ మణికంఠ రూ.50వేల నగదును బాలుడి బంధువులకు సీఐ సత్యనారాయణ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం**

తాండూరు: ఎస్సీ వర్గీకరణ జరిగితే సమన్యాయం జరుగుతుందని ఎంఎస్‌పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్ వేదికగా లక్ష డప్పుల వేయి గొంతుల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రచార పాదయాత్ర కళామండలి ఆధ్వర్యంలో చేపట్టగా శుక్రవారం తాండూరు పట్టణానికి చేరుకుంది.

**అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ**

దుద్యాల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రవికిరణ్‌రెడ్డి, నాయకులు మెరుగు వెంకటయ్య, ఖాజమీయ, కృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

**అతివేగమే ప్రమాదాలకు మూలం**

కోట్‌పల్లి: ప్రమాదాలకు మూలం అతివేగమేనని ధారూర్ సీఐ రఘురాములు అన్నారు. రోడ్డుభద్రత మహోత్సవాల సందర్భంగా శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గఫర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, ఏఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

**పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**

వికారాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

### క్రీడాకారులకు చేయూతనందిస్తా

పరిగి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అన్ని రకాలుగా చేయూతనందిస్తానని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ అన్నారు. జమీందార్ కేఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చిట్యాల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులకు టాటా గ్లూకోస్ వాటర్‌తోపాటు, భూమర్ బాక్స్‌లను, విజేతలకు జ్ఞానాబ్ధి మ్యాథ్స్ సిరీస్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### శివదీక్షతో మనసుకు ప్రశాంతత

బషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శివదీక్షతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని పూజ్యశ్రీ వీరతపస్వి మునీంద్ర శివాచార్యస్వామి హల్‌కట్టి అన్నారు. మండలంలోని నవాంద్గీ సంగమేశ్వరాలయం సన్నిధిలో శుక్రవారం జరిగిన శివదీక్షామాల ధారణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 75 మంది భక్తులు మునీంద్ర శివచార్యస్వామి చేతుల మీదుగా శివమాలధారణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.వీరామణిమాధవరెడ్డి, శివదీక్ష బృందం సభ్యులు రవీందర్‌రెడ్డి, శివప్ప పాల్గొన్నారు.

### మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తమకు కేటాయించి భూమిలో అక్రమ తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మాదారం సర్వేనెంబర్ 195/2లోని ఐదెకరాల భూమిని 2017లో నాటి ప్రభుత్వం ఘట్‌కేసర్ మండల క్రైస్తవుల సమాధుల కోసం కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం అట్టి భూమిలో కొందరు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్రాయిమ్, సుందర్‌రావు, రాజేష్, మార్టిన్, కేఫా, సునీల్, జాన్‌మాన్ పాల్గొన్నారు.

### వైభవంగా బురుజుల మైసమ్మ జాతర



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

తాండూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డిపల్లిలో గ్రామదేవత బురుజుల మైసమ్మ జాతరోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు ఆలయానికి బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఏర్పులసాని పద్మమ్మ సాయంత్రం వేళ భవిష్యవాణి వినిపించింది. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామంలోని ఆలయం వద్దకు ఊరేగింపుగా డప్పు వాయిద్యాల మధ్య తరలివచ్చారు. పోతురాజు విన్యాసం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పురుషోత్తంరెడ్డి, నారాయణ, విజయ్‌కుమార్, సాయిరెడ్డి, శ్రీనివాస్, సాయిలు, శేఖర్, ఉపాధ్యాయులు మధుసూదనరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులున్నారు.